క్లుప్తంగా

డేటా స్ట్రక్చర్స్‌పై శిక్షణ

మైలవరం: ఆధునిక ప్రపంచంలో డేటా స్ట్రక్చర్స్ అండ్ ఆల్గోరిథమ్స్ ప్రాజక్టుల అభివృద్ధి చేయడంలో ఉపయోగపడతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ విభాగంలో డేటా స్ట్రక్చర్స్ అండ్ ఆల్గోరిథమ్స్ పై శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ డేటా స్ట్రక్చర్స్ అండ్ ఆల్గోరిథమ్స్ క్యాంపస్ ప్లేస్మెంట్స్, ప్రోగ్రామింగ్ అండ్ టెక్నికల్ ఇంటర్వ్యూలలో ఎలా అవసరం అవుతాయో వివరించారు. ఈ ప్రోగ్రామ్ మంగళవారం నుంచి డిసెంబర్ ఏడో తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తిరువూరు విద్యార్థినులు



తిరువూరు: మార్షల్ ఆర్ట్స్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు తమ పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణరాజు తెలిపారు. విస్సన్నపేటలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి మార్షల్ ఆర్ట్స్‌లో బీ శ్రావణి, బీ కావ్యశ్రీ పాదెమ్మ స్వర్ణపతకం సాధించారని తెలిపారు. విశాఖపట్నం జిల్లా పాడేరులో త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థినులు జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయిని సుకన్యను అభినందించారు.

కల్యాణ మండపం నిర్మాణానికి రూ.50 వేల వితరణ

మెట్టగుట్ట(గంపలగూడెం): పెనుగొలను శివారు మెట్టగుట్టపై విరాజిల్లుతున్న శేషాచల శ్రీనివాసస్వామి దేవాలయ ప్రాంగణంలో కల్యాణమండప నిర్మాణానికి ఒక భక్తుడు మంగళవారం రూ. 50వేలు వితరణగా ఇచ్చారు. హైదరాబాదుకు చెందిన దంపతులు పొట్టి పెద్ద భాస్కరరావు, శారద ఈ మొత్తాన్ని వారి తమ్ముడు పొట్టి పున్నయ్య ద్వారా ఆలయ కమిటీ అధ్యక్షుడె జొన్నల ప్రతాపరెడ్డికి అందజేశారు.

అవగాహనతోనే హెచ్‌ఐవీ నిర్మూలన

నూజివీడు: హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉంటేనే దానిని నిర్మూలించవచ్చని ఏరియా ఆస్పత్రి సురక్ష క్లినిక్ కౌన్సిలర్ జి.లత అన్నారు. పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం రైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఐవీ బాధితులపై వివక్షతను చూపవద్దని ఆమె సూచించారు. ప్రిన్సిపాల్ డీ దుర్గాప్రసాద్, రైడ్స్ ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మి పాల్గొన్నారు.

బీపీటీ 3082 వరి రకం సాగుకు అనుకూలం

నూజివీడు: వరిలో బీపీటీ 3082 రకం తెగుళ్లను తట్టుకోవడమే కాకుండా 135రోజుల్లో కోతకు వస్తుందని ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ టీ సుజాత పేర్కొన్నారు. నూజివీడులోని వరి ప్రదర్శన క్షేత్రాన్ని మంగళవారం ఏరువాక కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త నాగేంద్రబాబుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీపీటీ 5204, ఎంటీయూ 1075 రకాలను క్రాసింగ్ చేయగా బీపీటీ 3082 రకం విత్తనం తీసుకువచ్చారని, దీనిని బాపట్ల వరి పరిశోధన స్థానంలో తయారు చేశారన్నారు. ఈ రకం తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకుంటుందని, బీపీటీ 5204 రకానికి ప్రత్యామ్నాయంగా రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నూజివీడు ఏడీఏ జీ విద్యాసాగర్, ఏఓ చాముండేశ్వరి పాల్గొన్నారు.

దారి ఏర్పాటుకు స్థల పరిశీలన

ఊటుకూరు/చెన్నవరం(గంపలగూడెం): గంపలగూడెం మండలం ఊటుకూరులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన లేఅవుట్ స్థలాలకు దారి ఏర్పాటు విషయమై నెలకొని ఉన్న సమస్య పరిష్కారం కోసం తిరువూరు ఆర్డీఓ కొత్త మాధవి మంగళవారం పరిశీలించారు. అదే విధంగా చెన్నవరం గ్రామంలో ఓబుల వీర స్వామి పొలానికి రాకపోకలు సాగించేందుకు దారి ఏర్పాటులో కూడా వివాదం నెలకొనడంతో ఆమె ఆ స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఆర్‌ఐ వీరభద్రరరావు, వీఆర్వో శ్రీధర్లు పాల్గొన్నారు.

ఓటర్ జాబితా పరిశీలనకు సహకరించాలి

నూజివీడు: ఓటర్ జాబితాలను క్షేత్రస్థాయిలో పరిశీలన కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు అధికారులకు సహకరించాలని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ కోరారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీ నాయకులతో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఒకటికి మించి ఓట్లు ఉన్న వ్యక్తి కోరుకున్న ప్రాంతంలో ఓటును ఉంచి మిగిలిన ఓట్లను రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

బడుగు వర్గాల ఆశాజ్యోతి పూలే

ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: బడుగు బలహీనవర్గాలకు సామాజిక అభ్యున్నతి కల్పించడంలో మహాత్మా జ్యోతిరావుపూలే విశేష కృషిచేశారని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో జ్యోతిరావుపూలే వర్ధంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, నగర పంచాయతీ చైర్ పర్సన్ గత్తం కస్తూరిబాయి, వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, ఏరువ ప్రకాష్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రామచంద్రారెడ్డి, లోకేశ్వర రెడ్డి, నాయకులు మోహనరెడ్డి, రవి, నెహ్రూ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు

గొప్ప సంఘ సంస్కర్త పూలే

నూజివీడు: మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని, కులాంతర వివాహాలను ప్రోత్సహించిన మహనీయుడని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతిని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఎమ్మెల్యే ప్రతాప్ తదితరులు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పూలే ఒక గొప్ప సాంఘిక విప్లవవాది అని, జీవితాంతం ప్రజల విముక్తి కోసం పాటుపడిన సేవాతత్పరుడన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు రాము, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోటమ్మ, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఊటుకూరులో..

ఊటుకూరు(గంపలగూడెం): గంపలగూడెం మండలం ఊటుకూరు అంబేడ్కర్ సెంటర్లో మంగళవారం జ్యోతిరావుపూలే వర్ధంతిని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జక్కుల కృష్ణ నివాళులర్పించారు.

ముసునూరులో..

ముసునూరు: బడుగు, బలహీన వర్గాల వెలుగుల కోసం జీవిత చరమాంకం వరకూ కృషి చేసి, మహాత్మా జ్యోతిరావు పూలే అందరికీ ఆదర్శంగా నిలిచారని జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ కె.రాజానాయన పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో పూలే వర్ధంతి మంగళవారం నిర్వహించారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: బహుజన దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక పూలే విగ్రహం వద్ద పూలే వర్ధంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పూలే విగ్రహానికి నివాళులర్పించారు.

పూలే ఆశయాలకు అనుగుణంగా పాలన



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వసంత

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మహాత్మా జ్యోతిరావ్ పూలే ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. కొండపల్లిలో జ్యోతిరావ్ పూలే వర్ధంతి సందర్భంగా మంగళవారం పూలే విగ్రహానికి ఘన నివాళి అర్పించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, నాయకులు గురవయ్య, శివారెడ్డి, అంకమోహనరావు, పద్మావతి, బ్రహ్మాజీ, శ్రీనివాస్, ప్రకాశ్, చిన్నయ్య పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్‌లో..

బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నవీన్‌గౌతమ్, ఏపీ జెన్‌కో శిక్షణ సంస్థ చీఫ్ ఇంజినీర్ ఎన్.నాగభూషణం పూలే విగ్రహానికి నివాళులర్పించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

పుట్రేల (విస్సన్నపేట): అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని పుట్రేల సచివాలయం–1 పరిధిలో పల్లెకు పోదాం, ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎమ్మె ల్యే మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సుకు కృషి చేస్తున్న మనసున్న మహారాజు మన జగనన్న అని పేర్కొన్నారు. అందుకే ప్రజలు మళ్లీ జగనే కావాలని కోరుకుంటున్నారన్నారు. వైఎస్సార్ సీపీ జెండా ను ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి ఎమ్మెల్యే సమక్షంలో ఆవిష్కరించారు. ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ స్వాతి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన

చాట్రాయి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదరిక నిర్మూలనకు దోహదపడుతున్నాయని ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చీపురుగూడెం చివాలయంలో నిర్వహించిన పల్లెకు పోదాం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్ సరోజని, ఎంపీటీసీ సభ్యురాలు స్వరూపరాణి, ఈఓపీఆర్డీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

బొద్దనపల్లిలో..

ఆగిరిపల్లి: వై ఏపీ నీడ్స్ జగన్, పల్లెకు పోదాం కార్యక్రమాన్ని మండలంలోని బొద్దనపల్లిలో మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక సచివాలయం వద్ద సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరాలతో కూడిన బోర్డును జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నరసింహారావు, జిల్లా కార్యదర్శి హరిబాబు, సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గణపవరం(మైలవరం): సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జే గంగాధరరావు తెలిపారు. మైలవరం మండలం గణపవరం సచివాలయం ప్రాంగణంలో సర్పంచ్ తమ్మా సీతారావమ్మ అధ్యక్షతన మంగళవారం పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. జెడ్పీటీసీ సభ్యుడు తిరుపతి రావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకట్రావు పాల్గొన్నారు.



పుట్రేల సచివాలయంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

కోడూరులో..

జి.కొండూరు: మండలంలోని కోడూరు గ్రామంలో పల్లెకుపోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించిన నాయకులు,సచివాలయంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు.

నూజివీడులో..

నూజివీడు: రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము అన్నారు. పట్టణంలోని 15,16 వార్డులకు సంబంధించిన 8వ వార్డు సచివాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయాల కన్వీనర్ పిల్లా చరణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, నాయకులు సుగుణరావు, ప్రసాద్, సురేష్‌బాబు, చిన్న కొండ పాల్గొన్నారు.

కోకిలపాడులో..

కోకిలంపాడు(తిరువూరురూరల్): పేదరిక నిర్మూలన ధ్యేయంతోనే ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి అన్నారు. మంగళవారం తిరువూరు మండలంలోని కోకిలంపాడులో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ నారాయణరావు, సర్పంచ్ మాధవి పాల్గొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: పల్లె సీమల సమగ్ర ప్రగతి జగనన్న సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, ఎంపీపీ కొండా దుర్గాభవాని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా మంగళవారం గుళ్లపూడి సచివాలయం వద్ద సర్పంచ్ శ్రీదేవి శ్రీనివాస్ అధ్యక్షతన పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డిస్‌ప్లే బోర్డును వైస్ ఎంపీపీ రాజానాయన ఆవిష్కరించారు.

జంగంగూడెంలో..

నూజివీడు: పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మండలంలోని జంగంగూడెంలో మంగళవారం నిర్వహించారు. సర్పంచ్అంజనీకుమారి, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శివ పాల్గొన్నారు.

చింతలనర్వలో..

చింతలనర్వ(గంపలగూడెం): హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తెలిపారు. గంపలగూడెం మండలం చింతలనర్వలో మంగళవారం వైఏపీ నీడ్స్ జగన్, పల్లెకు పోదాం కార్యక్రమాలను నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్, ఎంపీటీసీ సభ్యురాలు మేరీశాంతి పాల్గొన్నారు.

సంక్షిప్తం

● **కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ**

నూజివీడు: చిలకలూరిపేటలో ఇటీవల నిర్వహించిన కరాటే పోటీల్లో పట్టణంలోని సెయింట్‌థామస్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ బ్రదర్ రెవ. చిన్నపరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ పోటీల్లో మొత్తం 1,200 మంది పాల్గొనగా 12ఏళ్ల విభాగంలో నీరజ్ కృష్ణ స్వర్ణ పతాకాన్ని, రాజులపాటి రోహిత్ కాంస్య పతకాన్ని సాధించారని తెలిపారు.

● **వాలీబాల్ పోటీల్లో తృతీయస్థానం**

నూజివీడు: పట్టణానికి చెందిన సారథి ఇంజినీరింగ్ కళాశాల మహిళా జట్టు ఇటీవల ఏలూరులో నిర్వహించిన జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ పోటీల్లో తృతీయస్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సూరానేని శ్రీధర్ మంగళవారం తెలిపారు. డిసెంబరులో నిర్వహించే సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు కాలేజీకి చెందిన ఇంజినీరింగ్ తృతీయ సంవత్సర విద్యార్థిని ఎస్ నాగలక్ష్మి ఎంపికైనట్లు పేర్కొన్నారు. సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరానికి చెందిన విద్యార్థిని శివనాగ మౌనిక ఎంపికైనట్లు తెలిపారు. వీరిని ప్రిన్సిపాల్, ఏఓ అభినందించారు.

● **వీరాంజనేయస్వామిని దర్శించుకున్న ఆర్డీఓ**

మేడూరు(గంపలగూడెం): తిరువూరు ఆర్డీఓ కొత్త మాధవి మంగళవారం మేడూరు శ్రీ వీరాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆమెను మేనేజర్ వెంకటేశ్వర్లు సాదరంగా ఆహ్వానించారు. ఆర్డీఓను అర్చకులు రామచంద్రాచార్యులు ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

● **ముమ్మరంగా పత్తి కొనుగోళ్లు**

మైలవరం: మైలవరం మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నట్లు ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం మైలవరం యార్డులో పత్తిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన క్వింటాల్ ధర రూ.7200కు కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి, రైతు సలహా మండలి అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు తిరుపతిరావు, ఓబులాపురం సర్పంచ్ అప్పిరెడ్డి పాల్గొన్నారు.

● **నేడు ఎమ్మెల్యే పర్యటన**

చాట్రాయి: నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం పేదలకు పట్టాలు పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం 12 గంటలకు చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

● **ఆయుష్మాన్ భారత్ కార్డు ఉపయోగకరం**

విస్సన్నపేట: ఆయుష్మాన్ భారత్ కార్డుతో రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యసేవలు పొందవచ్చని డెప్యూటీ డీఎంహెచ్‌ఓ, నోడల్ అధికారి మోతీ బాబు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్, పుట్రేల సచివాలయం–1 వద్ద వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎంపీడీఓ వెంకటరమణ పాల్గొన్నారు.

● **దివ్యాంగ బాలలను ఆదరించాలి**

ముసునూరు: దివ్యాంగ బాలలను అందరూ ఆదరించి, అక్కున చేర్చుకోవాలని ఫిజియోథెరపిస్ట్ జి ప్రశాంతి అన్నారు. మంగళవారం సమగ్ర శిక్షా అభియాన్ ముసునూరు విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగ బాలల సౌకర్యాలు, వసతులను, వారిపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను, వివరించారు. అనంతరం ఫిజియో థెరపిస్ట్ దివ్యాంగ బాలలకు ఫిజియో అభ్యసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐఈఆర్ టీచర్లు ఎంవీ లక్ష్మీ నారాయణరావు, జె. నాగమల్లేశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● **నేడు సంకల్ప యాత్ర సదస్సు**

ఇబ్రహీంపట్నం: మండలంలోని తుమ్మలపాలెం (ఉదయం), ఈలప్రోలు (మధ్యాహ్నం) గ్రామాల్లో విక్షిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన సదస్సు బుధవారం జరుగుతుందని ఎంపీడీఓ రామకృష్ణనాయక్ పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, బ్యాంకర్లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

స్వామికి రజిత తోమాలార్చన

ఆగిరిపల్లి: స్థానిక యోగాంజనేయ ఆలయంలో మంగళవారం స్వామికి రజిత తోమాలార్చన నిర్వహించారు. స్వామికి అభిషేకాలు, అప్పాల నివేదన చేశారు. స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తిక బ్రహ్మోత్సవంలో భాగంగా దేవదాయ శాఖ నీరాజన మంత్రపుష్ప తీర్థ ప్రసాద వినియోగాలను ఆలయ ఈఓ భవాని ఆధ్వర్యంలో అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణ ఘనంగా నిర్వహించారు.

పెట్టుబడులతో ఆర్థిక శక్తి

జూపూడి(ఇబ్రహీంపట్నం): నిమ్రా కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌పై వెబ్‌నార్‌లో జాతీయ సదస్సు మంగళవారం జరిగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఐఏపీ ట్రైనర్ రఘుశంకర్ నేటి యువతరం యుక్త వయస్సులో క్యాపిటల్ మార్కెట్, మ్యూచివల్ ఫండ్స్, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా భవిష్యత్‌లో కలిగే ప్రయోజనాలు వివరించారు. యుక్త వయస్సులో పెట్టుబడులు పెట్టడంతో ఆర్థిక శక్తి సామర్థ్యాలు పెంచుకోవచ్చన్నారు.

9న లోక్ అదాలత్



మైలవరం: డిసెంబర్ 9వ తేదీన మైలవరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందని జడ్జి ఎం. శైలజ తెలిపారు. మైలవరం కోర్టు ప్రాంగణంలో మంగళవారం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జడ్జి ఎం. శైలజ న్యాయవాదులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయవాదులు, పోలీస్, కక్షిదారులు సహకారంతో ఎక్కువ కేసులు రాజీ పడేందుకు అవకాశం ఉందని చెప్పారు. రాజీ పడేందుకు అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కారం చేసుకునేందుకు కక్షిదారులు లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవాలన్నారు. సమావేశంలో మైలవరం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బుద్దవరపు వెంకట్రావు, న్యాయవాదులు పజ్జూరు రామకృష్ణ, శ్రీనివాసరావు, ఆంజనేయులు, శ్రీనివాసరావు, రమేషబాబు, ఎం.తనూజ్, దినేష్, శివ, మల్లిఖార్జునరావు, కిశోర్, మహిళా న్యాయవాదులు ఎం. దివ్యకీర్తి, నాగులూరి భావన పాల్గొన్నారు.

అందరి సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

జి.కొండూరు: ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధి ప్రజలకు సేవ చేసే స్థాయి నుంచి నియంత రాజకీయాలు చేసే స్థాయికి వచ్చినప్పుడు ప్రజలు శాశ్వతంగా రాజకీయ సమాధి కడతారని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. కాబట్టి సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే వరకు ప్రతి ఒక్కరూ స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మండల పరిధి చెవుటూరులో రూ.42 లక్షలతో నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని కేడీసీసీ చైర్మన తాతినేని పద్మావతి, కేడీసీసీ డైరెక్టర్ గుమ్మడపు రవీంద్రరాణాతో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 27 పీఏసీఎస్ బ్యాంకులు ఉండగా ఇప్పటికే 20 బ్యాంకులకు నూతన భవనాలను నిర్మించినట్లు వివరించారు. రైతుల సంక్షేమం కోసం ఏర్పాటైన ఈ బ్యాంకులు కార్పొరేట్ బ్యాంకులకు ఏ మాత్రం తగ్గకుండా అన్ని సేవలను అందిస్తున్నట్లు వివరించారు. రైతులు ఈ బ్యాంకులను సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. కేడీసీసీ చైర్మెన్ తాతినేని పద్మావతి మాట్లాడుతూ సహకార బ్యాంకులకు నూతన భవనాల నిర్మాణంలో మైలవరం నియోజకవర్గం కృష్ణాజిల్లాలోనే ప్రథమస్థానంలో ఉందన్నారు.

దేవినేని ఉమాపై పరువునష్టం దావా

రాజకీయంగా ఎదుర్కోలేని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఓటమి భయంతో తనపై క్షమించరాని తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ మండిపడ్డారు. దశాబ్దాల క్రితం వివిధ కారణాలతో మృతి చెందిన వ్యక్తులను తానే చంపానంటూ తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న దేవినేని ఉమాపై రెండు రోజుల్లో పరువు నష్టం దావా వేస్తున్నట్లు చెప్పారు. తాను నిజంగా హత్యలు చేయించి ఉంటే దేవినేని ఉమా మంత్రిగా ఉన్నప్పుడు కోడిగుడ్డు మీద ఈకలు పీకుతున్నాడా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా రెండు పర్యాయాలు నియోజకవర్గానికి ఏమీ చేయలేని ఉమా, స్థాయిని మరిచి తనని, సీఎంను అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసత్య ఆరోపణలు మానుకొని గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు.



చెవుటూరులో పీఏసీఎస్ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

చంటినాయన జన్మదిన వేడుకలు

నూజివీడు: స్థానిక ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తనయుడు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు మేకా నాగవెంకట వేణుగోపాల అప్పారావు(చంటినాయన) జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అభిమానులు, నాయకులు, కార్యకర్తల కరతాళ ధ్వనుల మధ్య కేక్ కట్ చేశారు. నియోజకవర్గంలోని నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు ద్వారకా ఎస్టేట్‌కు విచ్చేసి చంటినాయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేవరగుంట నాయకులు పల్నాటి రఘు దేవరగుంట నుంచి నూజివీడు వరకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం క్రేన్‌తో గజమాల తీసుకొచ్చి చంటినాయనకు వేసి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. ఏపీ స్టేట్ కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ వైస్‌చైర్మన్లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మురళీకృష్ణ, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, జెడ్పీటీసీ సభ్యులు వరికూటి ప్రతాప్, పిన్నిబోయిన వీరబాబు, దన్నపనేని వేణు, నాలుగు మండలాల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు శుభాకాంక్షలు తెలిపారు.



చంటినాయనను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

ఆపద్బాంధవుడు సీఎం వైఎస్ జగన్

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కష్టసుఖాలను తెలుసుకుని వాటిని పరిష్కరించి వారికి ఆపద్బాంధవుడిగా అండగా ఉంటున్నారని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని ఎంప్లాయీస్ కాలనీకి చెందిన మహ్మద్ నూస్రత్ కుమారుడు నబీబుల్లాకు బ్లడ్ క్యాన్సర్ రావడంతో చికిత్స నిమిత్తం ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తల్లి ఈనెల 17న నూజివీడు విచ్చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించి రూ.లక్ష మంజూరు చేశారు. మండలంలోని తుక్కులూరుకు చెందిన బొకినాల ప్రత్యూష కుమార్తె అవంతిక గుండెకు రంధ్రం పడి బాధపడుతున్న నేపథ్యంలో ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లగా స్పందించి రూ.లక్షను మంజూరు చేశారు. వీటికి సంబంధించిన చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు రాము, నాయకులు నాని, కాసులు, తుక్కులూరు సర్పంచ్ బుజ్జి, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.



సీఎం మంజూరు చేసిన చెక్కును లబ్ధిదారుడికి అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటప్రతాప్ అప్పారావు

260 మందికి కంటి వైద్య పరీక్షలు

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం సొసైటీ ఆవరణలో పీఏసీఎస్ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 260 మందికి పరీక్షలు చేశారు. మండల సచివాలయ కన్వీనర్ భరత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తిరుపతిరావు, రెడ్డిగూడెం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, నాయకులు బుజ్జి, రవీంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ రాబర్టు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

చాట్రాయి: 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ విశ్వనాథరావు పేర్కొన్నారు. మంగళవారం చాట్రాయిలో ఓటు నమోదుపై అ వగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంవలో వికాస్ కాలేజీ ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కనులవిందుగా దీపోత్సవం

ఊటుకూరు(గంపలగూడెం): ఊటుకూరు అభయాంజనేయస్వామి ఆలయాల వద్ద మంగళవారం రాత్రి దీపోత్సవం కనులవిందుగా నిర్వహించారు. శంకు, చక్రం, ఓం, శివలింగాకారంలో దీపాలు వెలిగించారు.

ఎమ్మెల్యే తనయుడికి నాయకుల శుభాకాంక్షలు



ముసునూరు: నూజివీడు ఎమ్మెల్యే తనయుడు మేకా నాగ వెంకట వేణుగోపాల్ అప్పారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు, అభిమానులు మంగళవారం భారీ సంఖ్యలో నూజివీడుకు తరలివెళ్లారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావు, జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, సర్పంచ్‌లు పిల్లి సత్యనారాయణ, పేరం కృష్ణ, ఆర్.శ్రీదేవి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ద్వారకా థియేటర్ వద్ద నిర్వహించిన అభినందన కార్యక్రమంలో నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావుతో కలిసి చంటినాయనను సన్మానించి, జ్ఞాపికలు బహూకరించారు.